కుక్కతోక

"ఇలా అయితే లాభం లేదు. సంసారమూ, పిల్లలూ, కష్టమూ, సుఖమూ అన్నవాటినన్నా లెక్క చెయ్యకుండా మీరు మీ యిష్టంవచ్చినట్టు తిరుగుతే మాగతి ఏం కాను? ఇద్దరుబిడ్డల తండ్రికీ, ముప్ఫైరెండేళ్ళ అనుభవం వున్న వ్యక్తికీ ఇవన్నీ ఏ కరువు పెట్టనక్కర్లేదు —"

భార్య మాటలు ఇదివరకులాగే విశ్వంచెవులకు తగిలీ తగలకుండాగాలిలో కలిసిపోయినై. అందుకు సమాధానంగా మాత్రం మామూలు ధోరణిలో తల ఊపాడు.'

కాస్త ఆగి వెళ్ళేందుకు లేచి నిలబడ్డాడు. లలిత తొందరపాటుతో, "డాక్టరు చాలా ప్రమాదమని చెప్పాడు. రాత్రికైనా ఇంట్లోవుండండి. నాకేమోభయం వేస్తోంది" అంది.

రోగిష్టి మంచంలోంచి పెద్దకొడుకు బాధగా "నాన్నా!" అంటున్నాడు. విశ్వానికి ఆ రోగమంతా బాధాకరంగా తోచింది. భార్యమాట లేవి వినిపించుకోని వాడి లాగు నటించాడు.

"మనతరం గడిచిపోతోంది. కష్టమో సుఖమో అనుభవించాము. కాని మరికొన్నిసంవత్సరాలకు పసిపిల్లలు పెద్దవాళ్ళవుతారు. వారికి దమ్మిడీ అయినా వుండదు. రెక్కలు రాకుండానే కూటికి మాడాల్సి వుంటుంది. నా గూర్చి విచారం లేదు. వాళ్ళకోసమైనా సానుభూతి చూపండి" ఇంక

చెప్పలేక కళ్ళను నీళ్లతో నింపింది. అంతా చూస్తూనే పరివర్తనను సూపించకుండా వెగటుగా నవ్వాడు.

రెండో కుర్రవాడు ఆతృతతో పరుగెత్తుకు వచ్చి, తండ్రివాలకంచూసి వెనుకంజ వేశాడు.

విశ్వం మెల్లిగా రెండడుగులు ముందుకువేశాడు. "మీ ఉద్దేశం నాకు అర్థమవటంలేదు" అంది లలిత. అర్థమయ్యేటట్టుగా విశ్వం చరచరా నడిచి వెళ్లిపోయ్యాడు. బిక్కమొగంవేసిన కుర్రాణ్ణి దగ్గరకు లాక్కొని, తనను తను సముదాయించుకుంటూ తలుపు గడియ వేసుకుంది లలిత.

2

కాఫీ హోటల్లో పాత స్నేహితుడెదురై, "ఇప్పుడేం చేస్తున్నావ్?" అన్నాడు.

విశ్వం నవ్వి, "ఏమీ లేదు – నువ్వో?" అన్నాడు.

"నేనా? మన బి. యే. పట్టాకు ప్రస్తుతప్రపంచంలో ఏమీ పని లేకపోయింది...ఉద్యోగం లేనిలోటు నీకేముందిలే! యాభై ఎకరాల షావుకారువి!"

తన సిల్కులాల్చీనీ, ఇస్త్రీబట్టల్నీ, సెంటువాసననూ చూచి తనను పెద్ద ఆస్థిపరుల్లో జమకడుతున్నాడు. విశ్వం చిరునవ్వు నవ్వాడు.

బిల్లు చెల్లించి బైటికివచ్చాక, "అట్లా బీచికి వెళ్దాం వస్తావా?" అన్నాడు.

"ఎందుకులే"

"పోనీ పిక్చర్‌కు—"

"ఎబ్బె! ఎక్కడికీవద్దు. ఇంటి ఆవిడకు ఆరోగ్యం సరిగ్గాలేదు. మందూ, పళ్లూ తీసుకువెళ్ళాలి. ఈపాటికి కుర్రాడు నాకోసం ఎదురు చూస్తూంటాడు—వెళ్తా—" అంటూ వెళ్లాడు స్నేహితుడు.

సంసారమంటే వీళ్ళకు ఇంత తాపత్రయమెందుకు? భార్యకు కాస్తముల్లు గుచ్చుకుంటే ముందు వీళ్ళప్రాణాలు పోతై! కొంచెం హాయిగా చల్లగాలికి అట్లా వెళ్ళివచ్చేపాటి విశ్రాంతైనా లేదుకాబోలు—వెధవసంసారం! స్వేచ్ఛలేని బానిసత్వం! అనుకుంటూ విశ్వం బీచికివెళ్ళాడు.

అతను కూర్చున్న చోటికి కొద్దిదూరంలో ఒక చిన్న సంసారం చేరింది. ఇద్దరుపిల్లలు పిచ్చికగూళ్ళు కట్టుకుంటూంటే దంపతులు చూసి ఆనందిస్తున్నారు; పిల్లలకు సరిగ్గా చేతకాకపోతే తగిన సహాయాన్నికూడా ఇస్తున్నారు. ఈ బొమ్మరిళ్ళలాగే ముందు జీవితానికి అసలు ఇళ్లే ఎంత అవసరమో బోధిస్తున్నారు కాబోలు! తనూ, తన భార్యా ఆవిధంగా బీచికి వచ్చి ఎనిమిదేళ్ళయింది. ఈ దంపతుల్ని చూస్తుంటే విశ్వానికి అనేక ఆలోచనలు వచ్చినై. తనభార్య నవ్వుతూంటే తనుచూసి ఆనందించలేని క్షణాలు జీవితంలో ఎలా ఎందుకు వచ్చినయ్యో అతనికి అర్థమవలేదు. తనభార్యలో గల లోపంకూడా అతనికి తెలియలేదు. ఆమె చాలా అందగత్తె అనితనకు తెలుసు. తనకుఏలోటు లేకుండా చూడడమే ఆమె ఆదర్శమనికూడా తనుఎరుగు. ఒక్కొకసారి

తను భోజనానికైనా ఇంటికి వెళ్ళకపోతే తనకోసం వేచి కూర్చొని ఆపూటకు పస్తుండీ, మర్నాడు తనకుగాను చేసిన వంటకాల్ని ఇంటికుక్కపాలూ, నౌకర్లపాలూ, చెయ్యటం కూడా తనకు తెలియందికాదు కాని ఆమెమీద అనురాగ మంతా ఏమైంది? కొత్తవస్తువుమీది వాంఛా, పాతవస్తువు మీది రోతావచ్చిందా ?

కుర్రాళ్లు ఆటమాని కొట్లాటలోకి దిగారు. ఇద్దరూ ఏడ్పుకూడా సాగించారు. దంపతులు చెరొకర్నీ ఎత్తుకొని మాయమాటల్ని చెపుతూ ముందుకు సాగిపొయ్యారు.

వెధవ సంసారం! పిల్లలు —బాధా— ఏడ్పూను! అనుకుంటూ విశ్వంకూడా రోడ్డున పడ్డాడు.

దార్లో బట్టలకొట్టు సాహుకారు ఎదురై నమస్కరించాడు. అతనిదర్శనం విశ్వానికి ఎందుకనో బాధగా తోచింది. విశ్వంతోనే నడుస్తూ సాహుకారు, "ఏడాది కావచ్చింది.. మీ పాత బాకీమాట మరిచిపోయారు—" అన్నాడు.

విశ్వం జేబుతడిమి చూచు కుం టూ, "ఎంత?" అన్నాడు.

"మూడొందల చిల్లర—"

విశ్వం మొదట్లో ఆశ్చర్యపొయ్యాడు. ఆ రోజుల్లో తను నీలవేణితో కలిసి బట్టలకొట్టుకు వెళ్లటం, సాహుకారు నవ్వుముఖంతో ఎంతోకాలంనుంచీ అమ్ముకుండాతమ కోసం దాచిన సిల్కు చీరెల్ని పరవటం, నీలవేణి నవ్వుతూ ఐదారు చీరెల్ని మాత్రమే సేకరించటం, తను మాట్లాడ

కుండా పద్దపుస్తకంలో దస్కతు పెట్టటం మొదలైనవన్నీ జ్ఞాపకం వచ్చినై. జేబులో మూడొందల రూపాయలుండే కాలం వెనుకనే పోయిందన్నమాటకూడా గుర్తొచ్చింది.

"సరే— త్వరలోనే ఇచ్చేందుకు చూస్తాను—". అన్నాడు.

"అలా అంటేకాదు. వ్యాపారం సరిగ్గాలేదు. డబ్బుకు చాలా అవస్థపడుతున్నాం. కొంతైనా సర్దాలి—"

విశ్వానికి యీ మాటలు చాలా అవమానకరంగా తోచినై. కాని తను బాకీ ఇచ్చుకొనేటంతవరకూ భరించి తీరాలని అతని కెవరో చెపుతూన్నట్టయింది.

"చూస్తానన్నానుగా — పైనెలలో...."

"మీరు సుస్తీ చెయ్యవొకండి-" సాహుకారు వెనక్కు తిరిగాడు. విశ్వానికి చాలాచికాకుగావుంది. బుర్రలో పాములు పాకుతూన్నట్టయింది.

క్షాఫీ హోటలుకు వెళ్లాడు. ఏదీ సరిగ్గా నయించలేదు. థియేటరువైపు బయలుదేరాడు — ఏ కాంక్షాలేదు. కాని ఎందుకనో తనకు తెలియదు.

3

చింతామణి నాటకంలోని నాయకుడు సరిగ్గా తనలాగే ప్రవర్తించసాగాడు. విశ్వానికి ఏదో దొంగతనంచేసి నలుగురియెదుటా అవమానింప బడుతూన్నట్టయింది. వెంటనే నాటకం మీది దృష్టంతా జీవితపర్యాలోకనంలోకి మారింది.

యాభై ఎకరాలభూమి కోర్టులపాలూ, నీలవేణిపాలూ కావటం గుర్తొచ్చింది. సాహుకార్లూ, వాళ్ళ బాకీలూ, తను అవమానంతో బాధపడడమూ, నీలవేణి సరదాలకోసం తను ఎకరం తరువాత ఎకరాన్ని అమ్మటమూ జ్ఞాపకం వచ్చినై. ఇంట్లో—భార్య, తనను జీవితాంతం వరకూ నమ్మిన ఇల్లాలు మంచిచీరెకోసం నోచుకోక పోవటమూ, నీలవేణి రోజుకొకరకం చీరెధరించి దర్శనం ఇవ్వడమూ స్మృతిపథంలోకి వచ్చింది ఆమె విటుల్ని ఆకర్షించేందుకు చేసిన ప్రయత్నాలు, తను రెండుమూడుసార్లు ఆమె ఇతరు లకు ఆనందాన్నివ్వటం చూసినఘట్టాలు, ఐనా ఆమెను ఆద రించిన విధానమూ అతనిబుర్రలో మెదిసింది. తనభార్య ఒంటిమీది నగలు ఒక్కొక్కటే నీలవేణిశరీరాన్ని అలంక రించినా—అసంతృప్తిగా తనకు అన్నీతక్కువైనట్టు ఫిర్యాదు చెయ్యటంలోగల కుత్సితం తనకు అర్థమైంది. ఇంట్లో తన రక్తస్పర్శవున్న బిడ్డలు గుడ్డలులేక, ఆటవస్తువులులేక తన కాళ్ళకు చుట్టుకొని ఏడ్వటమూ—నీలవేణి తమ్ముడు క్యాలెండర్లో ఉన్నవీ, లేనివీకూడా పండగలురాగానే వ్యవ హరించి బావగారిడబ్బుల్తో కొత్తదుస్తుల్ని ధరించటం కూడా అతనికి జ్ఞాపకం వచ్చింది.

తనెంత మూర్ఖుడై—పొరుగింటి పుల్లకూరకు చెయ్యి జాపుతూ, తన జీవితానికీ తనను ఆధారంచేసుకొన్న ఇతర్ల జీవితాలకీ ఏవిధంగా బాధ కలిగిస్తున్నాడో అర్థమైంది. "భార్య" లో వున్న సమానత్వమూ, విశ్వాసమూ, గౌర

వసూ లెక్క చెయ్యకుండా గొంగళిపురుగులాగు తను తోసి వేస్తున్నా ఇంకా తనకోసం ఆశతో కూర్చోవటమూ గుర్తొచ్చింది! యాభై ఎకరాలనాటి విశ్వం కాదతను; తన ఆస్తితోపాటే గౌరవంకూడా ఒక్కొక్క మెట్టే కిందికి జారింది. లేకపోతే సాహుకారు ఎన్నిగుంజీల్తో తన బాకీ సంగతి నడి రోడ్డుమీద ఎత్తగలడు? తనకుచాలా దగ్గరిదూరంలో వేచి కూర్చున్న బీదరిక రాక్షసిని లోకం ఇదివరకే గ్రహించింది; కాని తను నిర్లక్ష్యంగా ఇంతవరకూ దాని ఛాయనయినా గమనించలేదు. ఇప్పుడు తల్చుకుంటే పశ్చాత్తాపమూ, దుఃఖమూ ఏకమై బాధించసాగినై.

జీవితంలో యీ అపకీర్తిపాలు కాకూడదనుకున్నాడు. తనకన్న నీచస్థితికి వచ్చి బాగుపడ్డవారి జీవితాల్ని జ్ఞాపకం చేసుకున్నాడు. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. ఇన్నాళ్లూ లేని అసంతృప్తి కొండంతరూపంలో అతనికితోచింది. ఇంట్లో భార్య దీనాలాపాలూ, కొడుకుజ్వరంతో బాధ పడుతూ తనను యీరాత్రికి ఆగమని దీనంగా, జాలిగా, బాధగా ప్రార్థించటమూ కళ్లయెదుట కట్టినట్టయింది.

నాటకం అయిపోయినసంగతికూడా అతనికితెలియదు. జనం బైటికిపోతూంటే తనూ వెళ్లాడు. వెంటనే ఇంటికివెళ్ళి తన తప్పులకు క్షమార్పణ చెపుతూ జీవితాన్ని వేరుమార్గానికి తిప్పుకోవటమే కర్తవ్యంగా భావించాడు. ఈ ధృఢనిశ్చయంతోనే చకచక ఇంటిముఖం పట్టాడు.

4

కొడుకు మరణంతో విశ్వానికి పూర్తిగా మతి తిరిగి పోయింది. వాడిచావుకు తనే కారకుడైనట్టుగానూ, వాడు తన పాదాలకింద పడినలిగిపోయినట్టుగానూ—తనది ఏ భగవంతుడూ క్షమించలేని పాపమైనట్టుగానూ బాధపడసాగాడు. వాడు పుట్టినప్పుడు, పెరుగుతూన్నప్పుడు తను వాడి భావిని గూర్చి కట్టుకొన్న ఆశాసౌధాలు గుర్తొచ్చినయ్ .... ఇంట్లో గృహిణి దుఃఖంచూసి, ఆమె పుత్రుణ్ణి తను బలవంతాన పట్టి మృత్యుదేవతకు అందిచ్చిన పాపం తనను జీవితాంతం వరకూ వదలదనే నమ్మకంతో అతను మరీ బాధపడసాగాడు.

అత్తగారూ, మామగారూవచ్చి అల్లుణ్ణి, కుమార్తెను ఊరడించారు; కాని విశ్వానికి తృప్తికలగలేదు. ఏ విధంగా సరిపెట్టుకుందామన్నా అతని అంతరాత్మ ఒప్పుకోలేదు. స్వార్థంకోసం బలైనప్రాణిని తల్చుకున్నప్పుడు అతను నఖశిఖపర్యంతమూ ఒణికాడు.

నాలుగు రోజులు విశ్వం బజారుముఖం చూడలేదు

ప్లీడరు దగ్గర్నుంచి అర్జంటుగారమ్మనికబురు వచ్చింది. విశ్వం ఎల్లాగో విసుక్కుంటూ వెళ్లాడు. ప్లీడరుగారు. తన కొడుకు మరణానికి సానుభూతి చూపాక, "మనం వ్యాజ్యం గెలిచాం. ఇవ్వాళ వెంకటస్వామి కోర్టులో డబ్బు కట్టేశాడు. ఇదిగో!" అని మూడువేల రూపాయిల కరెన్సీనోట్లనూ అందిచ్చాడు.

విశ్వం వొక్కసారిగా వంద ఎకరాల ఆస్థిపరుడికి మల్లే గర్వపడ్డాడు. అనుకోని డబ్బువచ్చింది; కాని అనుభవించాల్సిన ఒకజీవి యీ లోకాన్ని విడింది!

ప్లీడరుగారి ఫీజు ఇచ్చేసి బైటపడ్డాడు. తనజేబు దాదాపు మూడువేల రూపాయిలతో నిండి వుందన్నమాట జ్ఞాపకం వచ్చినప్పుడల్లా అతనిలో అనేక కొత్తశక్తులు పని చేయసాగినై. దాన్ని ఖర్చుపెట్టాల్సిన విధానాలు అనేకం గుర్తొచ్చినై. ఇంటికివెళ్ళాడు; కాని తనుతెచ్చిన మొత్తానికి సరైన సంతోషాన్ని వెలిబుచ్చే వ్యక్తులేరీ? పైపెచ్చు—కుర్రవాడిచావుకు ఏడ్చేబంధువుల్ని చూసి తనుకూడా బాధపడతాడు. తనకు తెలుసు-చచ్చినవాళ్ళు బతికిరారని; వారికోసం కార్చే కన్నీరంతా వృధాఅని! ఇంతా తెలిసినా బాధపడతాడు. ఎందుకు? ఎవరికోసం? అసలుతను యీ సంగతులన్నింటినీ మరిచిపోయినట్టు నటిస్తే బాగుండుననిపించింది. కాని ఇది ఎలా సాధ్యమాతుందో తెలియడంలేదు.

బజార్లో నడుస్తూన్న తనను ఆ చీకటిలో ఎవరో రాచుకుంటూ వెళ్ళారు. ఆమత్తెక్కించే అత్తరువాసన అతన్ని ఒక్కసారిగా మేల్కొల్పింది. వెనక్కు తిరిగిచూచాడు. ఎలక్ట్రిక్లైటు కాంతిలో నిలబడి నవ్వుతూ, ఆ మెరిసేకళ్ళతో తనను ఆహ్వానిస్తోంది—ఒక అంగకత్తె! ఆమె రూపును చూస్తే అంతులేని కోర్కెలు రేకెత్తినయ్. భూలోకంలో అనుభవించాల్సిన సౌఖ్యాలు అనేకంఅతనికి జ్ఞాపకంవచ్చినై.

చరచరా నడిచి, తనకు తెలియకుండానే ఆమెను కలుసుకున్నాడు నవ్వి ఆమె సాగిపోయింది. బిస్కెట్ ముక్కను చూసి వెంటపడే కుక్కలాగు, మంత్రముగ్ధుడిలాగు ఆమెవెంట పడ్డాడు.

రెండుఫర్లాంగులు నడిచాక ఆమె ఒకమేడలో ప్రవేశించి తనను చెయ్యెత్తి పిలిచింది. ఆమెతో లోనప్రవేశించి పడకగదిలో ఆమెచూపిన కుర్చీలో కూలబడ్డాడు

"రాత్రల్లాఉంటూరా?" అందిఆమె.

తను చెప్పకుండానే తనకోర్కెల్ని కనుక్కున్న దేవత! వరాల్ని ప్రసాదించే దేవుడైనా ఇంత అనాలోచితంగా చొరవ ఇవ్వలేడేమో? ఎంత అందగత్తె! విశేషించి యువ్వనం పైకి చిమ్మే శరీరకాంతి అతనికి పిచ్చెక్కేట్టు చేసింది. తన కులగోత్రాలతోనూ, తన యీడుతోనూ, తన సంస్కారంతోనూ, దేంతోనూ పని లేకుండా, ఏలోపాన్నీ గమనించకుండానే—తనకు తనలాటి నూతనవ్యక్తికి భార్యాత్వాన్ని వహించబోతోంది. అదృష్టం అనేది ఒక్కొక్క సమయాన ఎంతచౌకగా లభ్యమౌతుంది!

"ఆఁ. ఎంత కావాలి?" అన్నాడు.

"యాభై!"

అతనికి ఆశ్చర్యమైంది. ఒక్క రాత్రికి యాభై! కాని కాస్త ఆలోచించాడు. నిజంగా ఆ సౌందర్యరాసికి యాభైరూపాయలు ఏమంత పెద్ద మొత్తం? తను నీలవేణి

కోసం నలభై ఎకరాల భూమిని అమ్మాలా ? వందమంది నీల వేణులైనా యీమెకు సరిరారు! తను యీ క్షణంలో ఇంత గొప్పవాడు యీకాస్త మొత్తానికి వెనుదియ్యటమేమిటి? ఇదిస్వార్థమేకావొచ్చు, కాని స్వార్థంకన్న విలువైనవస్తువేది? ఒకరాత్రి తనను ఏలోకాల్లోకో తీసుకుపోయి— ఇంటిదగ్గర తనుపడే బాధను మరిపింపజేసి — తన ఆజ్ఞకు రాత్రల్లా లోబడే వ్యక్తి!

"ఏమంటారు?" అంది తొందరపాటుతో.

"సరే - ఇప్పుడే వస్తాను - సిద్ధంగా ఉండు...."

తలతిప్పింది. మెల్లిగా స్పెన్సర్ కంపెనీలోకి జొరబడి పెద్దబిల్లును చెల్లించి అరగంటలో తిరిగి వచ్చాడు. ఆమె అలంకరించుకొని తన రాక కోసమే ఎదురుచూస్తూన్నట్టు వాకిట్లో నిలబడి వుంది. ఆమెను చూసేప్పటికి విశ్వానికి యీ లోకమే గుర్తులేదు. వెంటనే ఆ ఇంట్లోకి జొర బడ్డాడు.

— అక్టోబరు, 1941.